

# ప్రకృతి కాంత

"ఈ సృష్టిలో ప్రకృతిని మించిన గొప్పచిత్రం మరేదీ లేదు."

- జయప్రద

కోయిలమ్మ 'కుహూ కుహూ' రావాలతో లేభానుని మేలిమి పసిడి ఛాయలో అప్పుడే 'మంచు ముసుగు' తొలగించి లేచింది ప్రకృతి కాంత. పసిడి కాంతిలీను పచ్చని పసిరిగ బిగికౌగిలిలో మైమరచిపోతోంది భూమాత.

సరోవర పద్మం తన పద్మరాగాన్ని వెదజల్లుతూ చేయిచాచి తన సుకుమార, సుగంధ బాహువులలో ఇమిడి పొమ్మని ప్రార్థిస్తోంది సూర్య భగవానుని. 'రవి' ఛాయా స్పర్శకే పులకిత గాత్రయైపోతున్నదా ముగ్ధమనోహరి.

కడలి తీరాన కెంపుటి ధగధగాయమానాలు ఉవ్వెత్తున లేచే అలల నురుగుల కాంతులు. వినీలాకాశపు వింత సొగసులు ప్రకృతి కాంతకు అమందానందాలు, నిత్య నూతన శోభలు.

వికసిత వదనారవిందంతో ప్రభాత గీత మాలాపించింది శాంతి ప్రదాత... ప్రశాంత గంభీర మూర్తి ప్రకృతి కాంత.

"ఏమిటీ వింత కాంతి? నీలో ఐక్యం కావాలని ఎందుకో అనుభూతి? చెప్పమ్మా ఎచ్చోటి నుండి పుంజుకుంటిని తల్లీ ఈ ఆకర్షణ? ఎందుకమ్మా నీకీ వర్చస్సు? నీ మృదు కరద్వయంతో నన్ను బంధించు. పరిమితి లేక పయినించే భావాలకు దూరం కావించు. ఈ జీవన ప్రగతిలో నీ పుత్రుడుగా సహనంతో నీ కనుసన్నల మెలిగేలా ఆశీర్వదించు.... మాతా నీకు నా నమస్సులమ్మా!"

"ఆ వింత తేజస్సుతో నేనో కాంతి పుంజమైతే... ఆ చిటారు కొమ్మన చిగురు టాకులలో నేనూ ఒక ఆకునైతే... మెల్లగా చేరి చల్లగా తాకి ప్రకృతి కాంతను గిలిగింతలు పెట్టే పిల్లవాయువులో నేనో నలుసునైతే... కానమ్మా కాను... భూమాతకు భారంగా నీకు దూరంగా ఓ మనిషిగా మాత్రం చిత్రించబడ్డాను తల్లీ."

"మామిడి కొమ్మలో కోయిలనై... తదేకంగా నీ మృదు మధుర అవయవ శౌష్టవమును తనివిదీర గ్రోలుతూ మైమరచి ఎలుగెత్తి పాడాలనుంది. బృందావన రాధామాధవ మురళీ గానంలో నేనో రాగమై నీదరి చేరాలనుంది. నీ అంకమధిష్టించిన పచ్చని పైరులో ఓ గడ్డి పోచనై నిన్ను స్పృజించాలనుంది. నీ ప్రక్కన పవ్వళించాల నుందమ్మా... కాని... కాని... అనుభూతులే కాని అనుకరణాలు లేని నేను నేనుగా మాత్రం మిగిలిపోయాను జననీ....."

"కృష్ణా!"

"ఆ"

"ప్రపంచంలో వింతలన్నీ వదలి అచ్చటేం వెతుకుతావు?"

"అటు చూడు."

"ఏమున్నది? కారు చీకటి."

"హు... ఆ కారు చీకటిలో నీకు వెలుగే గోచరించడంలేదా? ఆ వెలుగులో మువ్వగోపాలుని చూడలేకపోతున్నావా? ఆ గజ్జల గలగలారావాలు నీకు విన్పించడం లేదా?"

"పిచ్చికృష్ణా! చీకటిలో వెలుగు కొఱకు తపనెందుకు?"

"చీకటి లేందే వెలుగు కన్పిస్తుందా? నలుపు లేందే తెలుపు గోచరమవుతుందా?"

"చీకటిలో స్పష్టమయ్యే వింతలు వెలుగులో వెలవెలపోతాయి. మౌనంలో వున్న మధురత మాటల్లో మాయమవుతుంది."

"చూడు... అటు చూడు అచంచలంగా ఠీవిగా నిలుచుని ఆకాశాన్ని చుంబించాలని తపనపడే ఆ కొండలవైపు ఒక మారు చూడు. ఆ శిఖరాగ్రాల కావలి కెళ్ళాలని లేదూ?... నా మనః చంచలతకు ఆ పర్వత శ్రేణుల చూచి సిగ్గుపడ్తున్నాను."

"అందని నాటికి ఆవేదన... తీరానికి చేరలేమని అసంతృప్తి. నీచంగా భావించుకొని కించపడడమెందుకు కృష్ణా."

----------

"కృష్ణా!"

"ఊ"

"ఏమిటాలోచిస్తున్నావ్? వెలుగు కిరణకాంతిలో మెరిసిపోతున్నావ్ సుమా?"

"చూశావా చీకటిలో వెలుగొచ్చింది. సుధాకరుని అమృత కిరణాలతో ఆడు కోవాలనిలేదూ? వెన్నెల సోపానాలతో చంద్రుని చేరాలని లేదూ! చూడు... ఆలే రెమ్మలు కబుర్లు చెప్పకొని కిలకిలారావాలు చేస్తున్నవి. గాలికి రెపరెపలాడే ఆకుల సవ్వడిలో క్రొంగ్రొత్త కథలు తెలియడంలేదా? గలగలా ప్రవహించే ఆ నదీమతల్లి ఏదో సందేశ మందిస్తోంది. విన్పించడమే లేదా?........ చూడు..... మానవుని మనస్సులోకి చొచ్చుకొని కాంతిని ప్రసాదించాలని తపన పడ్తున్నాడు.... సుధామయుడు. ఆ నిత్య నూతన కాంతి మానవుని కరుకుగుండెలో రక్తంతో సహా ప్రవహించలేక పోతోంది. సిగ్గుపడి చంద్రుడు మబ్బులమాటు కెళ్తున్నాడు చూసావా? ప్రకృతి కాంత మత్తుగా అరమోడ్పు కనులతో మానవుని గమనాన్ని పరీక్షిస్తోంది. అతని పిరికితనానికి ఆ మాతృమూర్తి భూదేవి హృదయం బాధతో మూలుగుతోంది. తల్లి ఆక్రందనను దీనాతిదీనమైన ఆమె పలుకు మందభాగ్యుడు మానవుడు అర్థం చేసుకోజాలడు."

"తల్లీ! భూదేవీ!! నేను నీ బిడ్డనమ్మా. నీ చల్లటి హస్తాలతో ఆవేదనాపూరితమైన ఈ నా కన్నీటి కణాలను తుడిపివేయి. చేతులు జోడిస్తున్నాను. ఆశీర్వదించు తల్లీ!"

* * * * *

వర్షధారలతో మైమరచి నాట్యం చేస్తోంది ప్రకృతి కాంత. మంగళకరమైన ఆకుపచ్చ ముసుగు తొలగించి సిగ్గుగా చూచి పరవశించింది. గాలివాలుకు వర్షపు ధారలు ఎటో ప్రవహిస్తుంటే పాలబుగ్గల పసికందు కాలుకదిపితే బుగ్గ చిదిమి ముద్దు పెట్టుకొని ఆనందించే మాతృమూర్తిలా తియ్యటి అనుభూతినందుతోంది.

ఒక్కొక్క నీటిబొట్టె గంగ, గోదారి, కృష్ణ ఆదిగా గల పవిత్ర నదీమతల్లులలో ఐక్యమై జన్మ సార్థకం చేసుకుంటోంది. అప్పుడప్పుడే కొండలమాటు నుండి తొంగి చూస్తున్న భాస్కరుడు వరుణదేవుడి ధాటికి తట్టుకోలేక దాక్కున్నాడు.

ప్రకృతి కాంత కొత్త చీరలో మెరిసిపోతోంది.

"ప్రకృతిమాతా! అభ్యంగన స్నానమాచరిస్తున్నావా? తలవిరబోసుకొని మాకేదో అద్వితీయ సందేసాన్ని అందజేస్తున్నట్టున్నావమ్మా!... ఆ ఉరుముల గర్జనలో నాకేదో మందలింపు.... ఆ మెరుపుల వినూత్న కాంతిలో నాబోటి మందభాగ్యుడైన పాంథునికి సువర్ణబాట. ఆ మెరుపుల కాంతిలో నిన్ను చూచి పునీతుడు కాని మానవుడెవరమ్మా.... అయ్యో! ఈ వడగళ్ళ వర్షంలో కూడా చిరునవ్వులే చిందిస్తున్నావ్... ఎంత శాంతి మూర్తివమ్మా. బిడ్డ తన గుండెలమీద సవారి చేస్తుంటే మాతృదేవి పొందే తియ్యటి బాధననుభవిస్తున్నావా జననీ!"

"అమ్మా! ఈనాటికి నా జన్మసార్థకమయినట్టుంది. 'రా బిడ్డ రా. కర్పూరకళిక వోలె నా గుండెలలో కరిగిపో. నా బాహువులలోనీకు చల్లదనాన్ని ప్రసాదిస్తాను. నా కనుపాపలలో నిన్న దాచుకుంటాను. నా పవిట చెంగుతో నీ కన్నీళ్ళు తుడుస్తాను. రా నాయనా రా' అని పిలిచినట్టుందమ్మా!"

"ఆ ఉరుముల ధ్వనిలో నా ఆక్రందన నీకు విన్పిస్తోంది కదూ! ఆ మెరపుల కాంతిలో నా మోము కన్పిస్తోంది కదూ? ఆ మెరుపుల మధ్య ఆ వినీలాకాశం ధవళ వర్ణాన్ని పుణికి పుంజుకొంటోంది. ఆ మెరుపుల మధ్య నుండి నా చూపు మరల్చలేను తల్లీ! ఏమా కాంతి! అబ్బ!! అమ్మా!! ఏమిటీ అంధకారం? ఎందుకీ కారుచీకటి? ఏమిటీ వైపరీత్యం?"

"అమ్మా! నా కళ్ళు తెరచే వున్నాయి. కానీ... కానీ... నువ్వు, నా తల్లివి కన్పించడం లేదమ్మా... అమ్మా! అమ్మా!! నేగుడ్డివాడనైనాను. లోకానికి వెలుగు ప్రదాత నాకు కారు చీకటిని బహుమతి చేసిందమ్మా. అమ్మా! అమ్మా!! అమ్మా!!"

"ప్రకృతిమాతా! నా చూపులో అసంతృప్తి నా ఆరాధనలో అసహ్యాతా గోచరించిందామ్మా? ఇప్పటికప్పుడే నా కళ్ళలో వెలుగును నింపి నోటివద్ద పాత్రను అన్యాయంగా అపహరించావా తల్లీ!... నీ ఆలింగనం లేందే నేనెలా బ్రతకనమ్మా... నిన్ను గాంచకుండా ఈ జీవనపథంలో ఎలా ముందుకు పోనమ్మా!.... ఈ జీవన ప్రగతిలో నాకే దారి జననీ!"

"అయ్యో! అయ్యో!!... మిసమిసలాడే నీ సౌందర్యాన్నెలా తిలకించను?"

"ప్రత్యూషకాలపు పసిడి కాంతులలో రాగమల్లియల పరిమళాలు ఆస్వాదిస్తూ... గులాబీల సౌకుమార్యంలో పరవశమందుతూ 'నునుసిగ్గు' నభినయించే నా ప్రకృతి మాతా ఇక నా కలలో పుష్పాల మాలికేనా! నా మదిలో నేను వెలిగించి నీకర్పించిన జ్యోత్స్నల నీడలు కూడా నాకు దూరం చేస్తున్నావా తల్లీ. అతి గంభీర కాసార నిశ్శబ్దతలో నా హృదిలోని నా భావనలనే విరయబూచిన కాంతులీను సంపెంగలుగా చేసి మాలకట్టి నిన్నలంకరించాలనుకున్నానే... ఆ భావనే నాకు కరువు చేస్తున్నావా అమ్మా! తల్లీ! విరియబూచిన నీలమందారవృక్షం. పూర్ణిమ నాటి శారదాకాశం - అందులో నవ్వుతూ రాకాసుధాకరుడు - కలువ కన్నియల సిగ్గు దొంతరలు - ఇవన్నీ ఇక నాకు అందని దివిటీలే కాబోలు - ప్రకృతి కాంతా! నీ వయ్యారి హొయల పారవశ్యాన్ని తిలకించను కూడా నన్ను తగని వాడిగా చేసావామ్మా... నన్ను మరలా అనాధుడిగా వదలిపెట్టావు తల్లీ!"

"ఇదేం న్యాయమమ్మా! 'అమ్మ' ఒడిలో నిద్రబోయే బాలకుని కన్ను పొడిచావమ్మా! ప్రశాంతంగా సాగిపోయే నిర్ఘరణిలో అలలు సృష్టించి... అలజడిరేపి ఆ ఆనందాన్ని తీరా అనుభవించకముందే లాక్కున్నావు జననీ! నాలో తీరని ఆవేదనను మాత్రం వదలి నీ ప్రశాంత మందిరంలో నవ్వుతూ నన్ను వీక్షిస్తున్నావు. నీకీ దాగుడు మూతలు తగదు తల్లీ తగదు. నీకిది న్యాయం కాదమ్మా. నీ 'బిడ్డ' కన్నీటికణాలలో ఈతరాక మునిగిపోతుంటే దూరంగా చేరి ఆనందిస్తున్నావా?... తీరని ఆవేదనలో కొట్టుమిట్టాడే నీ పుత్రుని ఆహాకారాలు విన్పించడం లేదా?.... నా వేదనారావాలకు నీ జాలి గుండెలో స్థానం లేదా? చెప్పమ్మా చెప్పు. నన్ను ఒంటరిగా ఈ నిశీథ నిశ్శబ్ద నిబిడాంధకారంలో చేదోడు లేకుండా వదలివేయదలచుకుంటివా తల్లీ!... అమ్మ చెంత చేరి పాలు కూడా తాగలేని అమాయకుడనమ్మా. చేతులు జోడిస్తున్నాను. నా కన్నీటి

కణాలతో నిన్నభిషేకిస్తున్నాను. కుమారా! రా! అని ఒక్కమారు తియ్యగా పిలువమ్మా."

"నీ ఆకుల గలగలారావాలలో నా హృదయ తంత్రుల మాధుర్యం విందామనుకున్నాను... నీ పచ్చని పమిట కొంగుతో నన్ను నేను పునీతుణ్ణి చేసుకొందామని భావించాను కానీ.... కానీ.... పద్మరాగాన్ని వెదజల్లే నా పద్మపుటూహలు కమలిపోయిన కమలాలే అయ్యాయి. నా కలలు..... కలలుగా మాత్రమే నిలిచిపోయాయి...."

"లేదమ్మా లేదు... నా భాగ్యానికి నిన్ను నిందించలేను. నా తల్లిపై అభాండాలు మోపలేను తల్లీ!"

"అదుగో అమ్మా! బృందావన తీరాన గోపాల కృష్ణుని అందెలరవళి, రాధా హృది పరవశగానం నాకు విన్పిస్తున్నాయమ్మా."

"అమృత మయీ! ప్రణయ సఖీ
రాధా! రాగమయీ రాధికా!!
నిదురలేవే రాధికా
తాళలేనీ బాధిక
తట్టిలేపుము నీ కృష్ణహృదిని
లే వేగసారించు నీ హృదయవీణ....."

"అమ్మా! అటు చూడు..... ఇది విను"

నదీ తీరాన గోపాల కృష్ణుని మురళీగానంలో లీనమై పరవశించే రాధిక మోము...... పులకిత గాత్రయై మోహనకృష్ణుని కౌగిలిలో అరమోడ్పు కనులతో నునుసిగ్గుతో చేసే గంధర్వగానం....

అమ్మా! కలలో కాంతి ఆ కాంతిలో నువ్వమ్మా.

నిర్మల హరితారుణ ప్రభాపుష్ప గుచ్ఛమై, రోహిణీ వర్ణజ్వాలా హాసమై, అత్యున్నత నవనీతగోళమై నవరత్న జనితామృతధారవై వెలుగొందే నిన్ను చేరుటకు సాధ్యమా తల్లీ!

కన్నులు లేవని కంపించి పోయాను. కానీ.... నా ప్రకృతి మాత దర్శనానికి కన్నులు అవసరం లేదమ్మా. ఇప్పుడు నాలో వేయి జ్యోతులు. అన్నీ కన్నులే. అదిగో

విచ్చుకుంటున్న సన్నజాజి.... ధవళకాంతులీను మల్లియ, ఎఱ్ఱగా జ్వాలా ముఖిమల్లే రాధామాధవి. అన్నీ నా కనుదోయి ముందు నాట్యమాడుచున్నవి. మాధవీలత ఒంపులు కన్పించుచున్నవమ్మా.

పాలకడలిబోలు వెన్నెలకాంతిలో వాయుమారుతపు చల్లని తాకిడిలో నాలో ఓ 'గిలిగింత.'

వేయి గోపికలలో ఒక్కడే మాధవ గోపాలుడు. నా వేయి భావనలో ఒక్కటే "ప్రకృతి కాంత."

కథా నిలయం
5345
శ్రీకాకుళం